ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్

ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, జనవరి 8 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ దగ్గరలో ఉన్న ఈవీఎం గోదాంను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ బుధవారం పరిశీలించారు. ఈవీఎం గోదాంకు వేసిన సీళ్లను పరిశీలించి, సీసీ టీవీలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోదాం వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో రంగనాథ్ రావు, తహసీల్దార్ జనార్దన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు సరళ, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు అనిల్, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులను వాడొద్దు

ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో కావ్యశ్రీ

బాన్సువాడ రూరల్, జనవరి 8 : మోతాదుకు మించి ఎరువులను వాడడంతో పంట నష్టం వాటిల్లి దిగుబడి తగ్గుతుందని, వ్యవసాయాధికారులు సూచనలు పాటిస్తూ ఎరువులను వాడాలని కొల్లూరు క్లస్టర్ ఏఈవో కావ్యశ్రీ రైతులకు సూచించారు. కొల్లూరు, వాసుదేవ్‌పల్లి శివారులోని వరి పంటలను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంట సాగులో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడకంపై దృష్టి సారించాలని సూచించారు. ఎక్కువ మోతాదులో యూరియా వాడితే పంటలకు తెగుళ్లు సోకే ప్రమాదం ఉందన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నస్రుల్లాబాద్, జనవరి 8 : బీర్కూర్ మండలం బరంగేడ్గి మంజీరా పరీవాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. బీర్కూర్‌లో పట్టుకున్న ట్రాక్టర్లను బీర్కూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఆటో స్టాండ్ కాదు బస్టాండే..

నాగిరెడ్డిపేట బస్టాండ్ ఆవరణలో నిలిపిన ఆటోలు

నాగిరెడ్డిపేట, జనవరి 8 : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆటోలకు అడ్డాగా మారింది. బస్టాండ్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో.. ప్రయాణికులు బస్టాండ్‌లోకి వెళ్లకుండా తాళ్లను కట్టారు. ప్రయాణికులు బస్టాండ్ ఎదుట ఉన్న ప్రైవేట్ దాతలు అందించిన బల్లాలపై కూర్చొంటున్నారు. దీంతో ఆటో వాలాలు తమ ఆటోలను దర్జాగా.. బస్టాండ్ ఆవరణలో పెట్టుకోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోలను బస్టాండ్ ఆవరణలో నిలపకుండా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘన్‌పూర్ పాఠశాలలో మాక్‌పోలింగ్

మాచారెడ్డి, జనవరి 8 : మండలంలోని ఘన్‌పూర్ జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు పోలింగ్ వేసే విధానం, పోలింగ్ అధికారులు, ఏజెంట్లు, నామినేషన్ వేయడం, ఓటర్ వ్యవస్థపై పూర్తిగా అవగాహన కల్పించారు. ఓటు వేసే విధానం, ఓటు విలువ, పోలింగ్ వ్యవస్థలో వాడే రిజిస్టర్లు, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్స్, ఓటర్ స్లిప్, ఓటర్‌కార్డు, గుర్తింపుకార్డుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని ఎంఈవో దేవేందర్ రావు పరిశీలించారు. మాక్ పోలింగ్‌తో విద్యార్థులకు పోలింగ్ వ్యవస్థ అర్థమవుతుందని అన్నారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సుంకొజి వెంకటాచారి, అంజలి, మంజురాణి, సంతోష్, దేవిచంద్, రమ, రజిత, గోపాలకృష్ణ, ఇలియాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాక్‌పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం

మాట్లాడుతున్న ఎంపీడీవో భానుప్రకాశ్

నస్రుల్లాబాద్, జనవరి 8 : బీర్కూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో భానుప్రకాశ్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాగునీటి సరఫరా, వేసవికాలంలో నీటి సరఫరా యాక్షన్ ప్లాన్ తయారీ, పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటిపన్ను చెల్లింపులు, నర్సరీ బ్యాగ్ ఫిల్లింగ్, సీడ్, జీపీడీపీ యాక్షన్ ప్లాన్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మాచారెడ్డి, జనవరి 8 : మండల కేంద్రం చెందిన జీపీ కార్మికుడిగా పనిచేస్తున్న సింగరాయిపల్లి నర్సింహులు తల్లి బాలవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. పేదరికంతో బాధపడుతున్న ఆ కుటుంబానికి నేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థిక సహాయం బుధవారం అందజేశారు. కార్యక్రమంలో నేస్తం అసోసియేషన్ అధ్యక్షుడు షాబుద్దీన్, బాలకృష్ణ, రాజు, అంజయ్య, నారాయణ, జహీర్, ఆరీఫ్, రవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సీనియర్ వాలీబాల్ జట్టుకు ఎంపిక

ధారవత్ లావణ్య

బాన్సువాడ రూరల్, జనవరి 8 : బాన్సువాడ మండలంలోని కొత్తాబాది గ్రామానికి చెందిన ధారవత్ లావణ్య జాతీయ సీనియర్ వాలీబాల్ జట్టుకు ఎంపికైంది. జిల్లా, రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ సీనియర్ వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు బుధవారం కోచ్ సురేందర్ తెలిపారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఉన్న సవాయి మాన్‌సింగ్ స్టేడియంలో ఈ నెల 13వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీల్లో ఆమె పాల్గొంటున్నట్లు తెలిపారు. మారుమూల గ్రామం నుంచి జాతీయ సీనియర్ వాలీబాల్ జట్టుకు లావణ్య ఎంపిక కావడంపై గ్రామస్తులు అభినందించారు.

మహిళలకు అవగాహన సదస్సు

నస్రుల్లాబాద్, జనవరి 8 : మండలంలోని దుర్కిలో బాన్సువాడ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం, స్వచ్ఛంద సేవా సంస్థ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (ఎస్ఎస్‌టీ) ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ సుజాత, కౌన్సిలర్లు బాలకృష్ణ, పర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఖాళీగా ఉన్న ప్లాట్లను రద్దు చేస్తాం'

బాన్సువాడ, జనవరి 8 : పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీలో గతంలో పేదలకు ఖాళీ ఓపెన్ ప్లాట్లను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ వరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు 900 ప్లాట్లను పంపిణీ చేశారని తెలిపారు. వాటిలో ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న ప్లాట్లను రద్దు చేస్తామని తెలిపారు. బీడీ వర్కర్స్ కాలనీలో గతంలో కొన్ని ప్లాట్లు తీసుకొని ఇతరులకు ఎక్కువ ధరలకు విక్రయించారని, వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్లాట్లపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని పేర్కొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

రాజంపేట్, జనవరి 8 : మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయం తాళం పగులగొట్టి హుండీలోని డబ్బులను ఎత్తుకెళ్లారు. గ్రామస్తులు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

వివరాలు సేకరిస్తున్న పోలీస్ సిబ్బంది

13 మందికి గ్రేడ్-4 కార్యదర్శులుగా ఉత్తర్వులు

13 మంది కార్యదర్శులకు ఉత్తర్వులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

భిక్కనూరు, జనవరి 8 : 13 మంది జూనియర్ కార్యదర్శులకు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా రెగ్యులర్ ఆర్డర్ ఉత్తర్వులను అదనపు కలెక్టర్ విక్టర్ బుధవారం అందజేశారు. ప్రజల మెరుగైన సేవలు అందించాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, కామారెడ్డి, బాన్సువాడ డివిజన్ల డీఎల్పీవోలు, పంచాయతీ కార్యదర్శుల జిల్లా అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, జనరల్ సెక్రటరి హన్మాండ్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు నిర్వహించాలి

రాజంపేట్, జనవరి 8 : గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా డివిజన్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గుడితండా గ్రామ పంచాయతీ రికార్డులను బుధవారం పరిశీలించారు. గ్రామంలో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో రఘురాం, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గుడి తండా గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా డివిజనల్ అధికారి శ్రీనివాస్

పోలీస్ స్టేషన్ తనిఖీ

ఎస్సైతో మాట్లాడుతున్న ఏఎస్పీ

రామారెడ్డి, జనవరి 8 : రామారెడ్డి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఏఎస్పీ చైతన్యారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ, పరిసర ప్రాంతాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్సై నరేశ్‌తో మాట్లాడి క్రైం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సైకి పలు సూచనలు, సలహాలు చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గాంధారిలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ట్రైనీ ఎస్సై అరుణ్ కుమార్

గాంధారి, జనవరి 8: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ట్రైనీ ఎస్సై అరుణ్‌కుమార్ సైబర్ నేరాలపై ప్రయాణికులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్‌నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అందరూ సుఖశాంతులతో గడపాలి

క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

ఎల్లారెడ్డిరూరల్, జనవరి 8: 2025లో అందరూ సుఖశాంతులతో గడపాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని కార్యాలయంలో ఆయన ఓ టీవీ ఆంగ్ల సంవత్సర క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వర్‌రావు, సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు, వైస్ చైర్మన్ మత్తమాల ప్రశాంత్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజితారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ సామెల్, నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్సీఎస్టీ యూఎస్‌టీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను పాఠశాల హెచ్ఎం మాణిక్యం, ఉపాధ్యాయ బృందంతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీయూఎస్‌టీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాలను సందర్శించిన స్పెషల్ ఆఫీసర్

రామారెడ్డి, జనవరి 8: సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ దాసరి ఒడ్డన్న బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఉదయం ప్రార్థన సమయంలో పాల్గొని విద్యార్థులకు నిత్యం కళాశాలకు రావాలని సూచించారు. పరీక్షల సమయంలో కష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం స్టాప్ రూమ్‌లో లెక్చరర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు చేశారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

పెద్దకొడప్‌గల్, జనవరి 8 : పిట్లం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగించినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం ఫోన్లు పోగొట్టుకుని బాధితులు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి అందజేశామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బిచ్కుంద మండల కేంద్రంలో షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

బిచ్కుంద, జనవరి 8 : మండల కేంద్రంలో 9వ వార్డులో మంగళవారం అర్ధ రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. మండల కేంద్రానికి చెందిన పత్తి నాగయ్యకు చెందిన ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఉన్న వస్తువులు, తినుబండారాలు, దుస్తులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. కాలనీవాసులు గమనించి నీటితో మంటలను చల్లార్చినా అదుపులోకి రాకపోవడంతో మద్నూర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఇల్లు దగ్ధం కావడంతో పత్తినాగయ్య కుటుంబం కట్టు బట్టలతో రోడ్డున పడింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎల్లారెడ్డిలో విరివిగా చైనామాంజా విక్రయాలు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 8: సంక్రాంతి పండుగకు ఇరవై రోజుల ముందుగానే గాలిపటాలు ఎగరవేయడాన్ని పిల్లలు, పెద్దలు ఆస్వాదిస్తారు. దీనివల్ల గాలిపటాలు, మాంజా, చరఖాల విక్రయాలు జోరుగా కొనసాగుతాయి. ఎల్లారెడ్డి పట్టణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా వెలసిన గాలిపటాల దుకాణాల్లో ప్రమాదకరమైన చైనా మాంజాను విరివిగా అమ్ముతున్నారు. బుధవారం పట్టణంలో చైనామాంజా వల్ల ఎయిర్‌టెల్ డిష్‌వైర్ తెగిపోయింది. దీంతో పలువురు ఆందోళన చెందారు. కాపర్ వైర్‌తో గట్టిగా ఉండే డిష్ వైరే అంత సుళువుగా తెగితే, కాళ్లుచేతులకు గాని, మెడకు గాని తగిలితే తీవ్రప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం చైనా మాంజా వాడవద్దని ప్రచారం చే సి అవగాహన కల్పించి నా, క్షేత్రస్థాయిలో పట్టించుకునే అధికారులు లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ చైనా మాంజా విక్రయా లు జోరుగా కొనసాగుతున్నాయి. ఇకనైనా మాంజాను విక్రయించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చైనామాంజాను వాడొద్దు

చైనామాంజా వల్ల తెగిన ఎయిర్‌టెల్ డిష్ వైరు

మాచారెడ్డి, జనవరి 8 : సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసేవారు చైనా మాంజాను వాడొద్దని, వాటిని విక్రయించిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై అనిల్ హెచ్చరించారు. గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో పలు షాపులను తనిఖీ చేసి మాట్లాడారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల భారిన పడి మోసపోవద్దని ఎస్సై అనిల్ సూచించారు. గజ్యానాయక్ తండా, ఎక్స్‌రోడ్‌లో బుధవారం అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఎట్టిపరిస్థితుల్లో చెప్పొద్దని సూచించారు.

బోరుమోటారు ప్రారంభం



ఎల్లారెడ్డి ఒడ్డెరకాలనీలోబోరు మోటారును ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 8: పట్టణంలోని 12వ వార్డు ఒడ్డెరకాలనీలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ నూతన బోరు మోటారును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో వేసవికాలంలో ఎటువంటి నీటి ఇబ్బందులూ ఎదురుకాకుండా ముందస్తుగా నూతనంగా బోరు వేసి మోటారును బిగించి ప్రారంభించినట్లు తెలిపారు. చైర్మన్‌వెంట వార్డు కౌన్సిలర్ జంగం నీలకంఠం అప్ప, అల్లం శ్రీను, నాయకుడు విద్యాసాగర్ ఉన్నారు.

పాలకవర్గ సమావేశం

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 8: ఎల్లారెడ్డి పట్టణంలోని సొసైటీలో పాలకవర్గ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు ఏగుల నర్సింహులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సొసైటీ కార్యదర్శి విశ్వనాథం మూడునెలల జమాఖర్చుల పట్టికను చదివి వినిపించారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు మత్తమాల ప్రశాంత్ గౌడ్, డైరెక్టర్లు సూర్యప్రకాశ్, పొలయ్య, బాల్‌రాజ్, లక్ష్మణ్, పాల్దె నారాయణ, నర్సింహులు, సుఖేందర్‌రెడ్డి, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి సొసైటీలో పాలకవర్గ సమావేశం నిర్వహిస్తున్న సభ్యులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లింగంపేట(తాడ్వాయి), జనవరి 8: తాడ్వాయి మండలంలోని దేవాయిపల్లి గ్రామ రహదారి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు కూలీలు గాయపడ్డారు. ఎల్లారెడ్డి మండలం అడివిలింగాల తండాకు చెందిన దారావత్ సిమ్లా, శేఖర్ వ్యవసాయ పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై తండాకు వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించారు.

సూపర్ చెక్ సర్వే

నల్లమడుగు గ్రామంలో సూపర్ చెక్ సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీవో నరేశ్

లింగంపేట, జనవరి 8: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ గృహాల సూపర్ చెక్ సర్వేను ఎంపీడీవో నరేశ్ నిర్వహించారు. ఇందిరమ్మ గృహాల కోసం గత సంవత్సరం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో గ్రామస్తులు చేసుకున్న దరఖాస్తుల అధారంగా ఆయా పంచాయతీల కార్యదర్శులు సర్వే నిర్వహించారు. బుధవారం మండలంలోని నల్లమడుగు, నల్లమడుగు పెద్ద తండా, లింగంపల్లి, మెంగారం, బోనాల్, కోర్పోల్ తదితర గ్రామాల్లో సర్వేను నిర్వహించినట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే 99శాతం పూర్తి

నాగిరెడ్డిపేట, జనవరి 8 : మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల సర్వే 99శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో ప్రభాకర్ అన్నారు. మండలంలోని రాఘవపల్లి గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో 7,764 కుటుంబాలు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకు 7,714 ఇండ్ల సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. ఆయన వెంట కంప్యూటర్ ఆపరేటర్ శివ ఉన్నారు.

క్రీడలపై యువత దృష్టి సారించాలి

పెద్ద కొడప్‌గల్, జనవరి 8 : చదువుతో పాటు క్రీడలపై యువత దృష్టి సారించాలని స్థానిక ఎస్సై మహేందర్ పేర్కొన్నారు. మండలంలోని కాటేపల్లి గ్రామంలో బుధవారం ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని ఎస్సై ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సమానంగా భావించి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రవీణ్ కుమార్, స్థానిక నాయకులు మల్లప్పపటేల్, మొగులాగౌడ్, రామాగౌడ్, హెచ్ఎం బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాటేపల్లిలో క్రీడాకారులకు క్రికెట్ జెర్సీలు అందజేస్తున్న ఎస్సై మహేందర్

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు గురుకుల విద్యార్థులు

జాతీయ స్థాయికి ఎంపికైన గురుకుల అథ్లెటిక్స్ విద్యార్థులు

రామారెడ్డి, జనవరి 8 : మండలంలోని ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు కె. ప్రవీణ్ కె. సంతోష్, ఎ. దిల్సన్, డి. సంతోష్ గత నెలలో ఎస్‌జీఎఫ్ అండర్-14 రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ శివారం బుధవారం తెలిపారు. వీరు ఈ నెల 11నుంచి 14 వరకు జార్కండ్ రాష్ట్రం రాంచీలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ తరపున పాల్గొంటారని కోచ్ సురేశ్ తెలిపారు. విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ..

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మద్నూర్, జనవరి 8: మండలకేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ గంగాకిశోర్, పీఈటీ గణేశ్ బుధవారం తెలిపారు. 10వ తరగతికి చెందిన రుతిక్, కరణ్, 8వ తరగతికి చెందిన జగదీశ్ ఎంపికయ్యారన్నారు. వరంగల్ జిల్లా గీసుకొండలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు సుమన్, వెంకట్, సంతోష్, వేణుగోపాల్, రాము, నరహరి, సమీనా అభినందించారు.

క్రీడల్లో కళాశాల విద్యార్థుల ప్రతిభ

సీఎం కప్ క్రీడల్లో సత్తా చాటిన జూనియర్ కళాశాల విద్యార్థులు

లింగంపేట, జనవరి 8: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు హైదరాబాద్ పట్టణంలోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో సత్తా చాటినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ బుధవారం తెలిపారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని సబావత్ అఖిల 53 కేజీల విభాగంలో రెజ్లింగ్ పోటీలో ద్వితీయ బహుమతి, సీఈసీ ప్రథమ సంవత్సరం విద్యార్థి సాయిబాబా లాంగ్ జంప్‌లో ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. బైపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థి రాహూల్ అథ్లెటిక్స్‌లో విజయం సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.